# డైరీలో ఒక పేజీ!

రచన:
శ్రీ సిహెచ్. సోమలింగం.

కాలానికి అంతం ఎక్కడ వుంది? అడ్డు ఏముంది? కాలం ఆగిపోదా???...

'మానవ జీవితానికీ, కాలానికీ, ఈ అవినాభావ సంబంధమేమిటో అర్థం కావటంలేదు. కాలం ఎంతో విలువైనదని, అమూల్యమయినదని అంటారు. కానీ, మారుతున్న కాలం విలువ తెలుసుకోవడం అసాధ్యమవుతోంది...అలాగే, కాలం చేతిలో మానవులు కీలుబొమ్మలుగా ఎందుకు తిరుగవలసి వచ్చిందో అర్థం కావటంలేదు. దానిని, కర్మ అనుకొని, సరిపెట్టుకోవాలేమో? మరి??

'కాలానికి కళ్ళెం లేదా?

'కాలానికి, సంకెళ్ళు లేవా?? అని అపుడపుడు అనిపిస్తూంటుంది.

'అనంతమయిన ఈ బ్రహ్మాండాన్నే ఆవరించుకున్న కాల మహిమ, సజీవ జీవరాసులమీద ప్రసరించి అధోగతిపాలుచేస్తోందో అర్థం కావటంలేదు.

'కాలం పరిధిలోనే, నేటి కోటీశ్వరులు_రేపటికి ఫకీరులు గావచ్చు ఈనాడు అడుక్కుతినే ముష్టివాడు తెల్లారితే లక్షాధికారి కావచ్చునేమో?...దీన్నిబట్టి ఊహిస్తే పరిస్థితులను, పరిసరాలను మార్చివేసే ప్రభావం కాలం తన విషపు చేతులలో ఇరికించుకుందేమోనని అపుడపుడు అనిపిస్తూంటుంది.

'జరగవలసింది ఎపుడో జరిగిపోయింది. కాలానికి ఎదురీదడంకూడ, తెచ్చుకున్న అవివేకమే అవుతుంది. ముందు ముందు ఏమవుతుందో అర్థం కావటంలేదు. అన్నిటికీ తెగించి వచ్చేసాడు రఘు. ఎక్కడకు వెళ్ళాలో, ఏంచెయ్యాలో తోచని పరిస్థితిలో అందిన బండి ఎక్కాడు. తనకి ఇదే మొదటిసారి ప్రయాణం చెయ్యడం. టికెట్టు లేకపోవడంవలన కలక్టరు రఘుని వాల్తేరు స్టేషనులో దింపేసాడు బలవంతంగా.

స్టేషను బైటకువచ్చి ఉసూరుమని నిట్టూర్చాడు. కానీ, ఏం ప్రయోజనం. చేద్దామంటే వుద్యోగం ఏదీ? తిండానికి డబ్బు ఏదీ?? ఉదరపోషణకు ఈ రెండింటిలో ఏదీ లేదు. అంతా శూన్యమే...బ్రతుకే శూన్యమనిపించేలా వుంది.

సాయంకాలం అయింది. సరస్వతీ జంక్షన్ వద్ద వున్న పార్కులో కూర్చుని ఆలోచిస్తున్నాడు రఘు.

గతం ఒక భయంకర స్వప్నం. రాబోయే రోజులు ఎలా వుంటాయో తెలియదు. నిరాశా, నిస్పృహలు అతని ముఖంలో ఆవరించాయి. జేబీలోనుంచి, చిన్న సైజు వెంకటేశ్వరుని ఫొటో తీసి భక్తితో కళ్ళకు హద్దుకున్నాడు.

'భగవాన్! ఏడుకొండల వెంకటరమణా! ఆపద మొక్కులవాడా!! ఆర్తత్రాణ పరాయణా!!! నువ్వే నాకు దిక్కు ప్రభూ! ఏం చేస్తావో! ఎలా చూస్తావో! అంతా నీ దయపై ఆధారపడివుంది ప్రభూ!.

భగవాన్!!, నన్ను దయదలచి కాపాడు తండ్రీ; నేను ఇక్కడకు చేరినపని సక్రమంగా నెరవేరితే పవిత్రమైన నీ కొండకు వచ్చి, నిన్ను దర్శనం చేసుకొని, నీ వ్రతాన్ని నిర్విఘ్నంగా నెరవేర్చుకుంటాను ప్రభూ! అని మనసులోనే ప్రార్థించి, ఫొటోను భక్తితో కళ్ళకు అద్దుకుని, భద్రంగా జేబీలో పెట్టుకున్నాడు రఘు... చుట్టూ ఒకసారి పరికించి చూసాడు రఘు. అది సాయంకాలం కావటంవలన పార్కు అంతా చాలా సందడిగా వుంది. పార్కు మధ్య, స్థంభం చివరనవున్న స్పీకరులోంచి కమ్మని సంగీతం వినిపిస్తోంది.

'అతనికి కడుపులో మండినట్లయింది. ఆకలి విపరీతంగా వేస్తున్నట్లు అనిపించింది. పొద్దుట బండి దిగిన దగ్గరనుంచి, ఏమీ తినలేదు. ఆ ఖాళీ కడుపుతోనే టౌను అంతా చుట్టేసాడు... జేబీలో చెయ్యిపెట్టి అందిన చిల్లర డబ్బులు పైకి తీసాడు. ఆ చిల్లర డబ్బులు చూడగానే అతని ముఖంలో విచార రేఖలు అలుముకున్నాయి.'

'ఈ కొద్దిపాటి ఎన్నాళ్ళు? ..'

'ఆలోచిస్తూంటే అతని మనసులో భయం కలిగింది, దిక్కులేని ఈ మహా నగరంలో ఎవరు చూస్తారు? ఎవరు ఆదరిస్తారు??...ఎక్కడ పని దొరుకుతుంది??? ...భయంతో అతని శరీరం బలధరించింది. చేతిలోవున్న చిల్లర డబ్బులను పిడికిటిలో గట్టిగా మూసి, హే! భగవాన్! ఏమిటీ పరిస్థితి?..., అనుకున్నాడు మనసులో,...'

కడుపులో ఆకలి దహించుకుపోతోంది. లేచి, పార్కు మధ్యవున్న పైపు వద్దకు నడిచాడు. ముఖం కడుక్కుని, కడుపు పట్టినన్ని చల్లని నీళ్లను త్రాగాడు' కడుపులో నీరు పడగానే కొంచెం నీరసం తగ్గినట్లనిపించింది. పార్కులో ఓ మూలగా బెంచిమీద చతికిలబడినాడు.

రేడియోలోనుంచి, పాతాళభైరవిలోని 'జగమే మాయ' పాట శ్రావ్యంగా వినిపిస్తోంది. అతని మనసు, ఇంటివైపు మరలింది. క్షణం కళ్ళు మూసుకున్నాడు.

'అమ్మ!...

పాపం! అమ్మ!! పుట్టినప్పటినుంచి, ఏ బాధా కలగకుండా కంటికి రెప్పలాగ కాపాడుకుంటు వస్తోంది. తన ముద్దుల కొడుకు ఏవో పెద్ద చదువులు చదవాలనే, పెద్ద పెద్ద వుద్యోగాలు చెయ్యాలనీ, తన చిన్నతనం నుంచీ ఎన్ని కలలు కన్నదో!...నాన్న శ్రమపడి తెచ్చిన ఆ కాస్త డబ్బుతో గుట్టుగా సంసారం గడుపుకునివస్తూ, తమ పేదరికం తెలియనీకుండా తాపత్రయపడుతోంది. పిచ్చి తల్లి!.

'రఘూ! ఎప్పటికైనా, నీవు పెద్ద వుద్యోగంచేసి, మన పేద కుటుంబాన్ని ఒక ఒడ్డుకు చేర్చి, నలుగురిలో మంచిని పెంపొందించి, గర్వంగా మన ఈ పేద కుటుంబాన్ని నిలబెడతావని, ఎంతో ఆశతో వేచివున్నాను బాబూ! అని విచారంగా కంటి తడిపెట్టింది. అది ఎపుడో తన చిన్నప్పటిమాట. తన జీవితంలో తన శరీరంమీద చిన్న దెబ్బ అయినా పడలేదు. అంత ఆప్యాయంగా, ప్రేమగా పెంచింది, అమ్మ...అటువంటి అమ్మ ఋణం ఎలా తీర్చుకోను. ఈ జన్మలో అది సాధ్యం అవుతుందో, లేదో; ఇపుడు తను ఇలా పరారి అయినందుకు; దుఃఖంతో, బెంగతో, ఎంతగా కుమిలిపోతోందో, ఏమో! ఆలోచిస్తున్నకొలదీ రఘు మనస్సు చింతాక్రాంతయైంది.

'అమ్మా! నన్ను క్షమించు...నీ విషయంలో, నేను చాలా అపరాధమే చేసాను. నా కార్యసాధనకోసం నీవు, నా చిన్నప్పటినుండి, కలలుకన్న పెద్ద వుద్యోగం కోసం, కన్న తల్లివయిన నీతో చెప్పకుండా పరారి అయ్యాను. అందుకు నీ తనయుని, వాత్సల్యంతో క్షమించు...అతని హృదయం బరువెక్కి, కళ్ళనుండి అశ్రువులు జలజల రాలాయి...ఆ మరుక్షణంలో తండ్రి అతని కళ్లముందు అస్పష్టంగా మెదిలాడు...అతని దుఃఖం కట్టలు తెంచుకుంది........

నాన్న!... నెలంతా గొడ్డులా చాకిరిచేస్తే, వచ్చిన ఆ జీతంరాళ్లను అమ్మచేతికి యిస్తాడు నాన్న. నాన్నలో వున్న గొప్ప గుణం అదే. చెడు సావాసాలు లేవు... దురభ్యాసాలు అంతకన్న లేవు. అటువంటి అతను, తన తండ్రి' అని గర్వంగా చెప్పుకుంటాడు తను. చిన్నప్పటి నుంచి, తనంటే నాన్నకి ఎంతో వాత్సల్యం. ఆఫీసు నుండి యింటికి రాగానే, 'రాముడూ! అని పిలుస్తాడు. ఇప్పటికీ అలాగే పిలుస్తాడు నాన్న. ఆ పేరంటే నాన్నకి ఏంతో యిష్టం. తనని చూడగానే అపుడపుడు కన్నీళ్ళు కారుస్తాడు. అమ్మ, అటువైపు రాగానే చొక్కాతో కన్నీళ్ళు తుడిచేసుకొనేవాడు. అపుడు నాన్న ఎందుకు అలా చేసేవాడో తనకి, అప్పటిలో అర్థంకాలేదు. ఏమయినా, తనంటే నాన్నకి ఏంతో అపేక్ష.

'రఘూ!...నీవు పెద్ద చదువులు చదివి, సంఘంలో ఒక గౌరవ స్థానాన్ని పొందాలి. అందుకు నాచేతనైనంతవరకు చదివిస్తాను.

నావలె, గుమస్తాగిరీ కాకుండా, గౌరవమైన వుద్యోగంలో ప్రవేశించి, గౌరవ, మర్యాదలు పొందాలి రఘూ!...అంతవరకు నీవు ఎంతవరకూ, చదవాలని వుందో చదువు...అని అన్నాడు తన తండ్రి...అనడమేకాదు, ధైర్యాన్నీ వుత్సాహాన్ని నూరిపోసాడు తండ్రి. ఆ సంవత్సరమే ఎస్సల్సీ పరీక్షలుకూడా అయిపోయాయి.

రఘూ! నీవు ఫస్టుక్లాసులో పాసవుతావు. — కోరికలూ, ఆశయాలూ, తప్పక ఫలిస్తాయి...ఫలించే రోజులు వస్తాయి రఘూ!...అని తనను ఆనందంలో హృదయానికి హత్తుకున్నాడు తండ్రి.

'కానీ! ఏ దేవుని మహాత్యమో, తన పరీక్షపోయింది. అందుకు ఎవర్నీ నిందించగలదు. ఆర్థిక పరిస్థితులు నానాటికీ దిగజారిపోతున్న ఈ తరుణంలో. ఇంకా పైకి చదవడం ఎలా సాధ్యపడుతుంది. ఎంతో విచారించాడు తను. ఈ దారుణ పరిస్థితికి నాన్న ఆశలు అడుగంటిపోయాయి. తన భ్రాంతి, భ్రాంతిగానే వుండిపో

యింది. ఆఖరికి, ఏదోఒక్క చిన్న నౌకరీ సంపాదించి, కుటుంబానికి, సాయపడటం తప్పించి ఇక ఏమీ లేదు తనకి.........

ఈ విషయమే ఒక రోజున తల్లి తండ్రులతో సంప్రదించగా, వారు ఎటూ నిర్ణయించుకోలేకపోయి మౌనంగా వూరుకున్నారు. ఆ మౌనం తనకు అర్ధాంగీకారం అనిపించింది.

కానీ;.. అమ్మమాత్రం అభ్యంతరం చెప్పింది. అప్పుడు తన ఆశ అంతా నీరు కారిపోయింది. వుత్సాహమంతా చప్పగా చల్లారిపోయింది. అవును నిజంగానే తనకి ఏడుపువచ్చింది. దుఃఖంతో గొంతుక పూడుకుపోయింది. తనింకా, చిన్నవాడేనా,!.

అవునుమరి; కని పెంచిన తల్లితండ్రులదృష్టిలో, తనింకా చిన్నవాడే... ఇంకా అమాయకుడే... కాని, లోకందృష్టిలో జ్ఞానం కలిగిన పెద్దవాడు. ఆమాట, తనను చూడగానే లోకమే అంటుంది. ఇంతమంది పడుతున్న బాధలమధ్యవుండి, వారి కష్టాలను చూస్తూ ఎట్లా వుండగలను. దీనికిఏదైనా పరిష్కారమార్గం ఆలోచించాలి. తప్పదు!...నిరంతరం తండ్రిపడుతున్న ఈకష్టాలను తన కళ్ళతో చూడలేదు. ఏదేశమైనా పోనాలి. తన తెలివితేటలు పుపయోగించి, ఏదైనా పనిసంపాదించాలి. ఆంతవరకు తనకు, మనస్శాంతివుండదు. తన ఆలోచనల పర్యవసానమే, ఆనాటి తనపరారీ.

ఆనాడు ఏమితిధో. ఏమినక్షత్రమో, తనజీవితంలో మరచిపోరాని, మరపురాని, సంఘటనజరిగింది. అదే తన జీవితాన్ని ముళ్ళడొంకలనుండి, సరియైనబాటపై పడవేసింది విధి,

రెండురోజులనుండి తిండిలేక. ఆకాలి కడుపుతో,


మా అభిమానులకు దీపావళి శుభాకాంక్షలు

ELTEX

ఎల్టెక్స్

మోటార్లు-పంపులు



వ్యవసాయిక, యంత్ర పరిశ్రమల అవసరాలకు ఆదర్శప్రాయంగా ఉపకరిస్తాయి.

ఎలెక్ట్రిక్, మోటార్లను, పంపులను విరివిగా వాడి, సరకు ఉత్పత్తిని అభివృద్ధి పరచుకోండి !!

వ్యాపార సంబంధమైన వివరాలకు వెంటనే వ్రాయండి!

: తయారు చేసినవారు :

ఎల్టెక్స్ ఇంజినీయరింగ్ కార్పొరేషన్ (ప్రై) లిమిటెడ్

కోయంబత్తూరు-6.

బ్రాంచిలు:- తంబుశెట్టి వీధి, మదరాసు-1 : : అరుణాచల ఆచారి వీధి, సేలం-1.

ప్రతిచోట పనిగురించి, అడుగుతూన్నాడు తను, కానీ, ఎక్కడా పనిదొరకలేదు. తీరని, నిస్పృహతో రోడ్డుమీద అస్తవ్యస్తంగా, చీకాకుపడిన మనసుతో, నడుస్తున్నాడు...రోడ్డుప్రక్కనున్న, పెద్దమేడ గేటుముందు రిక్షాదిగి, బాడుగయిచ్చి, గేటుతెరచుకొని, లోనికివెళ్ళిపోయాడు ఒక పెద్దమనిషి. రిక్షావానికిబాడుగయిస్తున్నపుడు, అతనిచేతిలోనుంచి, ఏదోవస్తువు జారి, యిసుకలోకి జారిపోవడం, దూరంనుండి చూస్తున్నతన దృష్టిని ఆకర్షించింది. దగ్గరకువెళ్ళి, చూసాడుతను. యిసుకలో తెల్లగా మెరుస్తోంది పావలాబిళ్ళ.

వంగొని, దానిని చేతితో సాడుతను...ఆ పావలాను చూడగానే, తనశరీంలో తేళ్ళు, జెర్రెలు, ప్రాకినట్లయింది. ఆ క్షణంలో అది వెయ్యిమణుగులబరువు వున్నట్లుతోచింది తనమనసుకి...అతని మనసులో అనేక ఆలోచనలు పరుగులుతీస్తున్నాయి. పావలా దుమ్ముదులిపి, జేబిలో వేసుకోబోయాడు...కానీ, తనకి, మనసు ఒప్పలేదు. గేటువైపు తలెత్తిచూసాడు తను. ఆ వ్యక్తిలోపలికి వెల్తున్నాడు.

బాబుగారూ!...పిలిచాడు...తను.

ఆ వ్యక్తి ఆగి, వెనక్కితిరిగి చూసాడు...ఏంకావాలన్నట్లు.

బాబుగారూ! ఇది మీచేతినుండి జారిపోయిందండీ!! అని_ఆ పావలా ఆ వ్యక్తి చేతికి అందించాడు.

ఆ వ్యక్తి, విస్మయంతో తనవైపుచూసి,! అబ్బాయ్! నీవు చాలామంచివాడివి...పావలాకోసం కక్కుర్తిపడకుండా, తిరిగియిచ్చేస్తున్నావ్...నీవు ఎవరి తాలూకబాబూ! అని అప్యాయత ఉట్టిపడేటట్లు, బుజంపై చెయ్యివేసి అడిగారు.

పేలవంగా నవ్వాడు తను అవునుమరి! పోయిందనుకున్నసొమ్ము, భద్రంగాచేర్చిన వ్యక్తి మంచివాడేమరి కాలంమారిపోయింది.

అనుకున్నాడు.

ఆ వ్యక్తి, నగరంలో పేరుమోసిన, ఒకకంపెనీ, మేనేజరు, రాఘవేంద్రంగారు...తన, విషాదగాధనంతా, చెప్పుకొన్నాడు తనూ, సహజంగా, జాలిగుండెగల ఆ మేనేజరుగారికీ, మనసుకరిగింది. తనకి ఉపకారంచెయ్యాలనే భావం ఆయనకుకలిగింది. ఆనాడు, తనయందు ఆయనకు దయకలిగింది, ఆయన తనబుజంతట్టి, రఘూ!, మరేంభయపడకు...కంపెనీలో, ఏదైనా, పని వచ్చేలాచూస్తాను. తరచు, నీవుకనిపిస్తూండు. అని చెప్పారు. ఆయన అలా అనగానే, తనకి, ఎక్కడలేని దైర్యంకలిగింది. ఆయన చలనవలన ఆ కంపెనీలో మొదటిసారిగా, ప్యూనుగా, జాయిను అయ్యాడు...కంపెనీ, మానేజరు రాఘవేంద్రంగారికి, క్రుతజ్ఞత చెప్పుకున్నాడు. పగలు, ఆఫీసుపనిచేస్తూ, రాత్రివేళ, ప్రయివేటుగాచదివి, బి.ఎ.వరకు పాసయ్యాడు తను,ఆతర్వాత తనగీతతిరిగింది. అదృష్టం కలిసివచ్చింది. కంపెనీలో ఎంతోనమ్మకంగా పనిచేస్తూ, అటు ఆఫీసర్లతోనూ,ఇటు కార్మికులతోనూ, ఎంతో మంచిపేరుతెచ్చు, కున్నాడు తను, వాటిపర్యవసానమే తనజీవతంలో కష్టాలు అంతం అయిపోయాయి.

కంపెనీ, మానేజరు ఆయన, రాఘవేంద్రంగారు, కొన్నికారణాలకలన, కంపెనీనుండి, విశ్రాంతినిమిత్తం తొలగిపోవడం, ఆయన, పట్టుదలతో, తననే మానేజరుగా నియమించమని, కమిటీకి సూచించడంవలన, ఆందరిసహాకారంతోటే, తను ఆ కంపెనికి, అసిస్టెంటు మానేజరు అయ్యాడు.

ఆనాటితో, తనను, అదృష్టం వరించింది. ఇందుకు కారకులు, రాఘవేంద్రంగారికి, జన్మంతా, ఎంతో ఋణపడివున్నాడు తను కాలంమారింది. మారుతోంది, కాలంతోపాటు మనుషులూమారుతున్నారు. అంతేకాని, మనుషులకుతగ్గట్లు, కాలం మారడం అసంభవం, కష్టాలు వస్తాయి. పోతాయి...వాటి వెనకనే ఆనందప్రవమయినసుఖంవస్తుంది. అవికూడ కాలంతోపాటే వస్తున్నాయి...అవి మానవులు కాసించినవి కావు.

అర్ధరాత్రి, గోడగడియారం పన్నెండుగంటలు కొట్టింది...తను ఎప్పుడో వ్రాసుకున్నడైరీని తదేకంగా చదువుతున్న రఘునాధరావు కళ్ళనుండి అశ్రువులు, రాలి, డైరీపైన పడినాయి. అవును. కాలానికి అంతం ఎక్కడవుంది. కాలం మనకోసం ఆగదు. దానితోపాటే, మానవజీవితంకూడ పరిభ్రమిస్తోంది. నిజం. డైరీనిమూసి, కనులు మూసుకుని, రెండుచేతుల మధ్యతలనుపుంచుకొని, క్షణకాలం మౌనంగా వుండిపోయాడు రఘు...టేబిలుపైనవున్న ఎలక్ట్రిక్ లైటు, ప్రకాశవంతంగా వెలుగుతోంది.